

చెలరేగిన బుమ్రా



తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 253 ఆలౌట్

- బుమ్రాకు 6 వికెట్లు, కుల్దీప్ యాదవ్‌కు 3
- భారత్‌కు 143 పరుగుల ఆధిక్యం
- అంతకుముందు డబుల్ సెంచరీ చేసిన జైస్వాల్
- కేరింతలతో భారత్ ఆటగాళ్లను ఉత్సాహపరిచిన ప్రేక్షకులు

వికెట్ తీసిన ఆనందంలో బుమ్రా

విశాఖపట్నం (స్పోర్ట్స్), ఫిబ్రవరి 3:



డబుల్ సెంచరీ చేసిన ఆనందంలో జైస్వాల్

ఇంగ్లండ్‌తో స్థానిక పీఎం పాలెం స్టేడియంలో జరుగుతున్న టెస్ట్ మ్యాచ్‌లో భారత్ పట్టు బిగిస్తోంది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి 171 పరుగులు ఆధిక్యంతో ఉంది. తొలిరోజు 176 పరుగులతో అజేయంగా ఉన్న భారత్ ఓపెనర్ యశస్వి జైస్వాల్ రెండో రోజు శనివారం డబుల్ సెంచరీ పూర్తి చేయడంతో స్టేడియం అభిమానుల కరతాళ ధ్వనులతో హోరెత్తింది.

మ్యాచ్‌లో శుక్రవారం తొలిరోజు ఆట ముగిసే సమయానికి ఆరు వికెట్లు కోల్పోయి 336 పరుగులు చేసిన భారత్ జట్టు..రెండో రోజు ఇన్నింగ్స్ ప్రారంభించిన కొద్దిసేపటికే అశ్విన్ (20) వికెట్‌ను కోల్పోయింది. ఇక 179 పరుగుల వ్యక్తిగత స్కోరుతో బ్యాటింగ్ కొనసాగించిన యశస్వి..ఇన్నింగ్స్ 101.2 ఓవర్‌లో బషీర్ వేసిన బంతిని స్క్వేర్ లెగ్ మీదుగా సిక్సర్ బాదాడు. ఆ తర్వాత బంతిని స్క్వేర్ లెగ్ మీదుగా బౌండరీకి తరలించి డబుల్ సెంచరీ పూర్తిచేశాడు. తొలి డబుల్ సెంచరీ చేసిన జైస్వాల్ ముందుగా స్టాండ్స్‌లోని ప్రేక్షకులకు అభివాదం చేసి..తర్వాత భారత్ శిబిరం వైపు తిరిగి ఆనందాన్ని వ్యక్తం చేశాడు. 277 బంతుల్లో 18 బౌండరీలు, ఏడు సిక్సర్లతో డబుల్ సెంచరీ పూర్తిచేసిన యశస్వి (209) మరో తొమ్మిది పరుగులు జోడించిన అనంతరం అండర్సన్ బౌలింగ్‌లో షాట్‌కు యత్నించి డీప్ కవర్‌లో స్టోక్ క్యాచ్ పట్టడంతో ఎనిమిదో వికెట్‌గా పెవెలియన్‌కు ... మిగతా 7వ పేజీలో

గిరి పల్లెల్లో పండుగ సందడి



పుష్యమాసం ఆఖరి రెండు వారాలు సంక్రాంతి జరుపుకోవడం గిరిజనుల ఆచారం

- 8వ తేదీ వరకు మన్యంలో కోలాహలం



హుకుంపేట మండలం గన్నేరుపుట్టులో అల్లూరి, ఆంగ్లేయుల వేషధారణలో యువకులు

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

మన్యంలో భిన్న ఆచారం ఇప్పటికీ కొనసాగుతోంది. సంక్రాంతి పండుగను జనవరి 14 నుంచి మూడు రోజులపాటు అందరూ జరుపుకుంటే మన్యంలో మాత్రం పుష్యమాసం ఆఖరి రెండు వారాలు జరుపుకోవడం గిరిజనుల ఆచారం. దీంతో గత జనవరి 25(పుష్య పౌర్ణమి రోజు) నుంచి ఫిబ్రవరి 8వ తేదీ వరకు గిరి పల్లెల్లో సంక్రాంతి పండుగ సందడి నెలకొంటుంది.

ఏజెన్సీలో సైతం సంక్రాంతిని వ్యవసాయ పండుగగానే భావిస్తారు. దీంతో భూమి, వ్యవసాయానికి వినియోగించే పశువులు, పనిముట్లు తదితరాలను పూజిస్తారు. తొలి రోజు భోగి మంటలు, ప్రతి రోజు రాత్రి వేళల్లో డప్పు వాయిద్యాలు, థింసా నృత్యాలతో సందడి చేస్తారు. భోగి మరుసటి రోజు సంక్రాంతి నిర్వహించుకుని, తమ పని ముట్లకు పూజలు చేస్తారు. పెద్దలను స్మరిస్తారు. ఈ రోజు పెద్దగా సందడి వాతావరణం ఉండదు. మూడో రోజును ఏజెన్సీలో పప్పుల పండుగ అంటారు. ఇది కేవలం పశువుల కోసమే నిర్వహిస్తారు. తమ వ్యవసాయానికి ఎంతగానో ఉపయోగపడుతున్న మూగ జీవాలను మంచిగా చూసుకోవాలనే ఆలోచన రేకిత్తించేందుకే దీనిని నిర్వహిస్తామని గిరిజనులు అంటున్నారు. పప్పుల పండుగ రోజున తమ పశువులను శుభ్రంగా కడిగి, వాటి కొమ్ములకు రంగులు రాస్తారు. అలాగే అరెసలు, బూరెలు, గారెలతో దండను తయారు చేసి వాటికి వేస్తారు. ప్రత్యేకంగా పులగాలను వండి వాటికి ఆహారంగా పెడతారు.

పుష్యమాసం ముగిసే వరకు పల్లెల్లో సందడే

గిరిజనుల సంప్రదాయం ప్రకారం పుష్యమాసం రెండో వారం నుంచి పక్షం రోజులు సంక్రాంతి పండుగను ... మిగతా 8వ పేజీలో

ఉలిక్కిపడిన విశాఖ

కలకలం రేపిన తహసీల్దార్ హత్యోదంతం

- కారణాలపై రకరకాల ప్రచారం
- విశాఖలోని భూమికి కన్వేయన్స్ డీడ్ జారీ వ్యవహారమే కారణమని సీపీ వెల్లడి
- విజయనగరం జిల్లాలోని భూ వివాదం కారణమంటున్న రమణయ్య సోదరుడు
- తెరపైకి ప్రసాద్ అనే వ్యక్తి పేరు



తహసీల్దార్ సనపల రమణయ్య (ఫైల్ ఫొటో)



నిందితుడు



విచార వదనంలో కుమారుడు కృష్ణ రంగతో తహసీల్దార్ సతీమణి అనూష

విశాఖపట్నం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి):

నగరంలో కలకలం రేపిన తహసీల్దార్ సనపల రమణయ్య హత్యకు కారణం ఏమిటనే దానిపై తీవ్రస్థాయిలో చర్చ జరుగుతోంది. ఇందుకు సంబంధించి రకరకాల ప్రచారం జరుగుతోంది. నగర పోలీస్ కమిషనర్ రవి శంకర్ అయ్యన్నార్ శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి రూరల్ తహసీల్దార్ కార్యాలయం పరిధిలోని భూమికి సంబంధించిన కన్వేయన్స్ డీడ్ జారీ అంశమే హత్యకు కారణమని స్పష్టంగా చెప్పారు. రూరల్ తహసీల్దార్ కార్యాలయం పరిధిలోని కొంత భూమిలో రియల్టర్ ఒకరు భవన నిర్మాణాలు చేశారని, వాటిని విక్రయించాలంటే కన్వేయన్స్ డీడ్ తప్పనిసరి కావడంతో తహసీల్దార్‌పై గత కొద్దిరోజులుగా ఒత్తిడి తెస్తున్నారన్నారు. రియల్టర్ అప్పటికే రూ.5-6 కోట్లు అప్పుల్లో ఉండడం, భవనం కూడా బ్యాంకుకు మార్జిగేజ్ చేసి ఉండడంతో తహసీల్దార్ చుట్టూ తిరుగుతున్నాడని, ఈ క్రమంలోనే హత్యకు పాల్పడి ఉంటాడని సీపీ వెల్లడించారు.

అయితే రమణయ్యకు వరుసకు సోదరుడిగా చెబుతున్న రాజేంద్ర అనే వ్యక్తి మీడియాతో మాట్లాడుతూ తమకు విజయనగరం జిల్లా చీపురుపల్లి సమీపంలోని బొండపల్లి వద్ద మూడు ఎకరాల భూమి ఉందని, దానికి అనుకునే మధురవాడ ప్రాంతానికి చెందిన గంగారాం ప్రసాద్‌కు నాలుగు ఎకరాలు భూమి ఉందని చెబుతున్నారు. తాము వేరొకరికి రూ.1.8 కోట్లు బాకీ ఉండగా, వారి తరపున ప్రసాద్ వకల్తా పుచ్చుకుని ఎంవీపీ కాలనీలో తాను ఉంటున్న ఫ్లాట్‌ను ఖాళీ చేయాలని బెదిరించడంతో రెండు నెలల కిందటే ఎంవీపీ కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేశానని వెల్లడించారు. తాజాగా శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ప్రసాద్ బొండపల్లిలోని తమ భూమి వద్దకు వెళ్లి వాచ్‌మన్ ప్రకాష్ సెల్ నుంచి తనకు ఫోన్ చేసి భూమిలోకి వస్తే సాయంత్రం నాలుగు గంటలయ్యేసరికి చంపేస్తానని బెదిరించాడని ఆరోపించారు. తనను చంపేస్తాడేమోనని భయంతో తాను దాక్కొంటే తన సోదరుడైన రమణయ్యను చంపేశాడని, అలా జరుగుతుందని ఊహించలేదని అంటున్నాడు. దీంతో రమణయ్య హత్యకు కారణం ఏమిటనే దానిపై స్పష్టత ... మిగతా 7వ పేజీలో

పోలీసుల కళ్లుగప్పి బెంగళూరుకు నిందితుడు - 7లో

తగ్గని పొగమంచు

- జి.మాడుగులలో 9.7 డిగ్రీలు



పాడేరు- విశాఖపట్నం మెయిన్‌రోడ్డులో శనివారం పొగమంచు

పాడేరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు స్థిరంగా కొనసాగుతున్నాయి. గత ఐదు రోజులుగా సింగిల్ డిజిట్ కొనసాగుతున్నది. దీంతో చలి తీవ్రత, పొగమంచు కొనసాగుతున్నది.

జి.మాడుగులలో 9.7, పాడేరులో 11.8, అరకులోయలో 12.4, ముంచంగిపుట్టులో 12.8, పెదబయలులో 13.3, హుకుంపేటలో 13.4 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రతలు శనివారం నమోదయ్యాయి. శీతాకాలం నేపథ్యంలో మరి కొన్ని రోజులు చలి వాతావరణం కొనసాగే అవకాశాలున్నాయని వాతావరణశాఖ సూచిస్తున్నది. ప్రస్తుతం శీతాకాలం, ఉత్తరాది నుంచి చలిగాలులు వీస్తుండడంతో చలి తీవ్రత కొనసాగుతున్నది. దీంతో మన్యంలో తెల్లవారుజాము నుంచి ఉదయం తొమ్మిది గంటల వరకు దట్టంగా పొగమంచు కురుస్తున్నది. మధ్యాహ్నం వేళలో ఒక మోస్తరుగా మాత్రమే ఎండ కాస్తూ, సాయంత్రం నాలుగు గంటల నుంచే చలి ప్రభావం మొదలవుతున్నది. దీంతో ఏజెన్సీ వాసులు వణుకుతున్నారు.



చింతపల్లిలో మంచు

జీకే వీధి, చింతపల్లిలో..

చింతపల్లి: మన్యంలో చలి తీవ్రత పెరిగింది. శనివారం జీకే వీధిలో 11.8, చింతపల్లిలో 12.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఎం.సురేశ్‌కుమార్ తెలిపారు. మరో వారం రోజులు ఏజెన్సీలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని ఆయన తెలిపారు. చలితో పాటు మంచు అధికంగా కురుస్తున్నది. ఉదయం పదిన్నర గంటల వరకు మంచు వీడడం లేదు. దీంతో ఈ ప్రాంత ప్రజలు చలి, మంచు వల్ల తీవ్ర అవస్థలు పడుతున్నారు.

ఎర్రబయలు వాసులపై దాడి

- కోడిపందేల సమాచారం పోలీసులకు ఇచ్చారని అనుమానం
- రెచ్చిపోయిన వనగరాయి, గొందిపల్లికి చెందిన గిరిజనులు
- 21 మందిపై కేసులు



ఎర్రబయలు గ్రామంలో ధ్వంసమైన ఇల్లు

పాడేరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెదబయలు మండలం మారుమూల ఇంజెరి పంచాయతీ ఎర్రబయలు గ్రామస్థులపై సమీపంలోని మరో రెండు గ్రామాలకు చెందిన గిరిజనులు దాడికి పాల్పడిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎర్రబయలు మారుమూల ప్రాంతం కావడంతో శనివారం ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీనికి సంబంధించి వివరాలు ఇలా వున్నాయి. ఎర్రబయలు, గొందిపల్లి, వనగరాయి, తూలం, తదితర గ్రామాలకు చెందిన గిరిజనులు ప్రతి ఏడాది ఎర్రబయలు ప్రాంతంలోనే సంక్రాంతి పండుగ చేస్తారు. ఇందులో భాగంగా కోడిపందేలు, గల్లాటలు వంటివి జరుగుతుంటాయి. పండుగలో భాగంగా శుక్రవారం కోడిపందేలు జరుగుతున్న సమయంలో అకస్మాత్తుగా పోలీసులు దాడి ... మిగతా 8వ పేజీలో

మిరియాల రైతు విలవిల

మార్కెటింగ్ సదుపాయం కల్పించని జీసీసీ, ఐటీడీఏ

- ప్రైవేటు వర్తకులు కిలో రూ.450కు కొనుగోలు
- కేరళ మార్కెట్‌లో కిలో రూ.560- 580
- ఆవేదన చెందుతున్న ఆదివాసీ రైతులు



లంకపాకలులో రైతులు సేకరించిన మిరియాలు

చింతపల్లి/గూడెంకొత్తవీధి, ఫిబ్రవరి 3:

ఆదివాసీ రైతులు పండించిన మిరియాలకు గిట్టుబాటు ధర లభించడం లేదు. గిరిజన సహకార సంస్థ, ఐటీడీఏ మార్కెటింగ్ సదుపాయం కల్పించకపోవడం వల్ల రైతులు ప్రైవేటు వర్తకులను ఆశ్రయిస్తున్నారు. జాతీయ మార్కెట్‌లో గరిష్ఠ ధర ఉన్నప్పటికి తప్పనిసరి పరిస్థితుల్లో తక్కువ ధరకు విక్రయించుకుంటున్నారు.



కాండం నుంచి మిరియాల గింజలను వేరు చేస్తున్న రైతులు

పాడేరు రెవెన్యూ డివిజన్ పరిధిలో 98 వేల ఎకరాల్లో మిరియాల సాగు చేపడుతున్నారు. ప్రతి ఏటా 3,500 మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తున్నది. గిరిజన రైతులు కాఫీ తోటల్లో అంతర పంటగా మిరియాల పంటను సాగు చేస్తున్నారు. రైతులు ప్రతి ఏటా జనవరి రెండో పక్షం నుంచి మార్చి ఆఖరు వరకు మిరియాలను సేకరించి మార్కెటింగ్ చేస్తున్నారు. కాఫీ పంట సేకరణ ముగియగానే రైతులు మిరియాల సేకరణ ప్రారంభిస్తారు. ఈ ఏడాది మిరియాల దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. ఈ ఏడాది గరిష్ఠ ధర లభిస్తుందని ఆశపడిన రైతులకు నిరాశే మిగిలింది.


ప్రాంతీయ మార్కెట్‌లో కిలో రూ.450 ధరకు కొనుగోలు

మిరియాల గింజలకు ప్రాంతీయ మార్కెట్‌లో ప్రైవేటు వర్తకులు కిలో రూ.450కు కొనుగోలు చేస్తున్నారు. గత ఏడాది ప్రైవేటు వర్తకులు మార్కెటింగ్ ప్రారంభంలోనే కిలో రూ.470కు కొనుగోలు చేశారు. కేవలం పదిహేను రోజుల్లోనే మరో రూ.30లు పెంచి రూ.500కు కొనుగోలు చేశారు. గత ఏడాది దిగుబడులు తగ్గినప్పటికి కిలోకి రూ.500ధర లభించడంతో ఆదివాసీ రైతులు ఊరట చెందారు. ఈ ఏడాది ప్రైవేటు వర్తకులు ప్రారంభ ధర రూ.450కు మిరియాలు కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు దిగాలు చెందుతున్నారు.

మార్కెటింగ్ సదుపాయం కల్పనలో విఫలం

ఆదివాసీ రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించడంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్న ఆరోపణలు ఉన్నాయి. ఆదివాసీ ... మిగతా 8వ పేజీలో

ఐఎన్ఎస్ సంధాయక్ జాతికి అంకితం



సర్వే నౌక 'ఐఎన్ఎస్ సంధాయక్'ను శనివారం విశాఖపట్నం నేవల్ డాక్‌యార్డులో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయనకు నౌకాదళ అధికారులు జ్ఞాపిక అందజేశారు.

- వివరాలు మెయిన్ 3లో



చెరువులవేనంలో పర్యాటకులు

లంబసింగికి పర్యాటకుల తాకిడి

ఆంధ్ర కశ్మీర్ లంబసింగికి శనివారం పర్యాటకుల తాకిడి పెరిగింది. ఉదయం ఐదు గంటల నుంచే చెరువులవేనం, తాజంగి జలాశయం, లంబసింగి జంక్షన్‌లో పర్యాటకుల సందడి ప్రారంభమైంది. చెరువులవేనం వ్యూపాయింట్ వద్ద మంచు మేఘాలను ఆస్వాదించారు. అక్కడ ఫొటోలు దిగుతూ సందడి చేశారు. అలాగే యర్రవరం జలపాతానికి అధిక సంఖ్యలో పర్యాటకులు వచ్చారు. - చింతపల్లి

క్రైం... crime news

269 మద్యం బాటిళ్లు స్వాధీనం



కొడవటిపూడిలో పోలీసులు పట్టుకున్న మద్యం బాటిళ్లు

కోటవురట్ల, ఫిబ్రవరి 3: మండలంలోని కొడవటిపూడిలో దాడి చేసి 269 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ రమణయ్య తెలిపారు. శనివారం నిర్వహించిన దాడిలో కర్రి అమ్మాజీ ఇంట్లో మద్యం బాటిళ్లను పట్టుకున్నట్టు చెప్పారు. స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్ల విలువ రూ.38,280 ఉంటుందన్నారు. బెల్ట్‌షాపులో ఆమె బాటిల్‌పై రూ.పది నుంచి రూ.20 అదనంగా విక్రయిస్తున్నదన్నారు. ఆమెపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు. గ్రామాల్లో ఎవరైనా మద్యం అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడ అమ్మకాలు చేసినా తమకు సమాచారం ఇవ్వాలని ఆయన ప్రజలను కోరారు.

దిబ్బపాలెంలో..

కొత్తూరు : అనకాపల్లి మండలంలోని దిబ్బపాలెంలో అక్రమంగా విక్రయిస్తున్న బెల్టుషాపుపై అనకాపల్లి రూరల్‌పోలీసులు శనివారం దాడి చేశారు. ఈ దాడుల్లో షాపులో ఉన్న 10 మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ మేరకు మళ్ల ఉమాశంకర్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన చెప్పారు.

ఉలిక్కిపడిన విశాఖ

... 5వ పేజీ తరువాయి

లేకుండాపోయింది.

ఎవరీ ప్రసాద్!

తన సోదరుడు, తహసీల్దార్ రమణయ్యను హత్య చేసింది ప్రసాదేనంటూ రాజేంద్ర ఆరోపిస్తుండడంతో అసలు..ఈ ప్రసాద్ ఎవరని ఆరా తీస్తున్నారు. పోలీసులు చెబుతున్న రియల్టర్, రాజేంద్ర ఆరోపిస్తున్న ప్రసాద్ ఒక్కరే అయి ఉంటారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మధురవాడలోని వుడా కాలనీలోని జువెల్ అపార్టుమెంట్‌లో ఉంటున్న గంగారాం ప్రసాద్ గతంలో ఒక రియల్ ఎస్టేట్ కంపెనీలో పనిచేసి మానేశాడని సమాచారం. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ బ్రోకర్‌గా పనిచేస్తున్నాడు. రుషికొండ (సర్వేనంబర్ 22)లో రెండు ఎకరాల భూమిలో ఇటీవల కొన్ని భవనాలు నిర్మించాడని, అందుకోసం భారీగా అప్పులు చేశాడని, ఇప్పుడు విక్రయించాలనుకునేసరికి కన్వేయన్స్ డీడ్ అవసరం పడడంతో దానికోసం తహసీల్దార్ రమణయ్యను ఆశ్రయించినట్టు సమాచారం. తాజాగా రమణయ్యకు విజయనగరం జిల్లా బొండపల్లి మండలానికి బదిలీ కావడంతో ఆ పని తాను చేయలేనని రమణయ్య స్పష్టంచేయడంతో విచక్షణ కోల్పోయి హత్య చేసి ఉంటాడని కొంత మంది అనుమానిస్తున్నారు. అయితే ప్రసాద్ హత్య చేశాడా?, లేకపోతే వేరొకరితో హత్య చేయించాడా? అనేదానిపై కూడా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు వివరాలను వెల్లడిస్తేనే గానీ హత్యకు గల కారణం, నిందితులు ఎవరనేది తెలిసే అవకాశం లేదు.

చెలరేగిన బుమ్రా

... 5వ పేజీ తరువాయి

చేరాడు. చివరి రెండు వికెట్లు వెంటవెంటనే పడిపోవడంతో భారత్ తొలి ఇన్నింగ్స్ 396 పరుగుల వద్ద ముగిసింది.

నిప్పులు చెరిగిన బుమ్రా...

లంచ్ సమయానికి ముందు ఇంగ్లండ్ బ్యాటింగ్ ప్రారంభించింది. ఓపెనర్ బెన్ డకెట్ (21) నిలదొక్కుకుంటున్న సమయంలో కులదీప్ యాదవ్ అద్భుతమైన బంతితో అవుట్ చేశాడు. అర్ధ సెంచరీతో ఊపు మీద కనిపించిన మరో ఓపెనర్ జాక్ క్రాలే (76)ను అక్షర పటేల్ పెవెలియన్‌కు పంపడంతో ప్రేక్షకులలో ఉత్సాహం వచ్చింది. 24వ ఓవర్‌లో బౌలింగ్‌కు వచ్చిన జస్ప్రిత్ బుమ్రా మ్యాచ్ స్వరూపాన్ని మార్చేశాడు. తన రెండో ఓవర్‌లో రూట్ (5)ను అవుట్ చేసిన బుమ్రా...తర్వాత ఓవర్‌లో పోప్‌ను పెవెలియన్‌కు పంపాడు. తొలి టెస్టులో 196 పరుగులు చేసిన పోప్ (23)...ఈ మ్యాచ్‌లో వికెట్ల ముందు పాతుకుపోతున్న సమయంలో బుమ్రా అవుట్ చేయడంతో స్టేడియం హర్షధ్వానాలతో మారుమోగింది. కొద్దిసేపటికే జానీ బెయిర్‌స్టో (25)ను కూడా బుమ్రా పెవిలియన్‌కు పంపడంతో ఇంగ్లండ్ 159 పరుగులకు ఐదు వికెట్లు పడిపోయి కష్టాల్లో పడింది. రెండో స్పెల్‌లో తిరిగి బౌలింగ్‌కు వచ్చిన బుమ్రా అదే ఊపును కొనసాగించాడు. వ్యక్తిగత 47 పరుగులతో ఉన్న కెప్టెన్ బెన్ స్టోక్‌ను అద్భుతమైన బంతితో క్లీన్ బౌల్డ్ చేయడంతో ఇంగ్లండ్ శిబిరం డీలాపడిపోయింది. బెన్ ఫోక్స్ (6), రెహాన్ అహ్మద్ (6)లను కులదీప్ యాదవ్ పెవెలియన్‌కు పంపగా...చివరి బ్యాట్స్‌మెన్లు టామ్ హార్ట్‌లీ (21), అండర్సన్ (6)లను బుమ్రా అవుట్ చేయడంతో ఇంగ్లండ్ ఇన్నింగ్స్ 253 పరుగుల వద్ద ముగిసింది. బుమ్రా 6 వికెట్లు తీయగా, కుల్దీప్ 3, అక్షరపటేల్ ఒక వికెట్ తీసుకున్నారు. 143 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యతతో రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగిన భారత్ కెప్టెన్ రోహిత్ శర్మ, జైస్వాల్‌కు ప్రేక్షకులు చప్పట్లతో స్వాగతం పలికారు. రెండో రోజు ఆట ముగిసే సరికి భారత్ ఐదు ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 28 పరుగులు చేసింది. జైస్వాల్ 15, రోహిత్‌శర్మ 13 పరుగులతో క్రీజులో ఉన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	97.00
లైవ్ ధర	117.00
విత్ స్కిన్	204.00
స్కిన్ లెస్	214.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

ఫుల్ జోష్!

▸ భారత్ ఆటగాళ్ల ప్రతిభకు ప్రేక్షకుల నీరాజనం

▸ చప్పట్లతో మార్మోగిన ఏసీఏ వీడీసీఏ స్టేడియం



జైస్వాల్ అద్భుత బ్యాటింగ్



బుమ్రాను అభినందిస్తున్న సహచర ఆటగాళ్లు



జస్ప్రీత్ బుమ్రా బౌలింగ్



స్టేడియంలో క్రికెట్ అభిమానుల కోలాహలం

భారత్- ఇంగ్లండ్ జట్ల మధ్య ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో జరుగుతున్న రెండో టెస్ట్ మ్యాచ్ అభిమానుల్లో ఫుల్ జోష్ నింపుతోంది. బ్యాటింగ్‌లో సత్తా చాటిన టీమిండియా సభ్యులు, బౌలింగ్‌లోనూ విజృంభించడంతో ప్రేక్షకుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. మ్యాచ్‌ను వీక్షించేందుకు శనివారం భారీగా జనం తరలి వచ్చారు. దీంతో పలు స్టాండ్‌లు కిక్కిరిసిపోయాయి. జైశ్వాల్ డబుల్ సెంచరీ సాధించడంతో అభిమానుల కరతాళధ్వనులతో స్టేడియం హోరెత్తింది. ఇంగ్లండ్ బ్యాట్స్‌మన్లు పెవిలియన్‌కు క్యూ కడుతున్న సందర్భంలోనూ ప్రేక్షకులు కేరింతలు కొట్టారు. మొత్తమ్మీద టెస్ట్‌మ్యాచ్ వన్డే తరహాలో సాగుతుండడం అభిమానుల్లో ఫుల్ జోష్ నింపింది. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



యువతుల కేరింత



బుమ్రాతో రోహిత్‌శర్మ

రా.. కదిలి రా.. సభకు అనుమతులు ఇవ్వండి

▸ కలెక్టర్‌ను కోరిన టీడీపీ నాయకులు

అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 3: కె.కోటపాడు మండలం గొండుపాలెంలో ఈనెల ఐదో తేదీన నిర్వహించనున్న రా.. కదిలి..రా కార్యక్రమానికి అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టిని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు కోరారు. శనివారం ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రానున్న వివరాలతో పాటు వెళ్లనున్న వివరాలు, ప్రసంగ సమయాన్ని కలెక్టర్‌కు వివరించారు. అలాగే ఎస్పీ కేవీ మురళీకృష్ణను కలిసి సభా ప్రాంగణం వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భద్రతా ఏర్పాట్లు చేయాలని కోరారు. కలెక్టర్, ఎస్పీని కలిసిన వారిలో మాజీ ఎమ్మెల్యేలు కేఎస్ఎన్ఎస్ రాజు, పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ నాయకుడు మళ్ల సురేంద్ర తదితరులు ఉన్నారు.



రా... కదిలి ... రా సభకు అనుమతులు కోరుతూ వినతిపత్రాన్ని అందిస్తున్న బుద్ద నాగజగదీశ్వరరావు

డీఎస్సీ పేరుతో జగన్నాటకం

▸ టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు

అనకాపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికలకు ముందు డీఎస్సీ నోటిఫికేషన్ అంటూ నిరుద్యోగులను నమ్మించడానికి ముఖ్యమంత్రి సరికొత్త జగన్నాటకానికి తెరలేపారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు ఆరోపించారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అబద్ధాలు, మోసం, నయవంచనలకు బ్రాండ్ అంబాసిడర్ అయిన జగన్‌రెడ్డి నాలుగు సంవత్సరాల తొమ్మిది నెలలుగా ఉపాధ్యాయుల భర్తీని పట్టించుకోకుండా ఎన్నికల ముందు హడావుడి చేస్తున్నారన్నారు. మెగా డీఎస్సీ ఇస్తామని, ఆ తరువాత ఏడాదికి ఒక డీఎస్సీ అన్నారని, గిరిజన యువతకు ప్రత్యేక డీఎస్సీ అన్నారని, ఇపుడు 6వేల పోస్టులు భర్తీ చేస్తామని, అదికూడా ఎప్రెంటీస్‌గా అంటున్నారని అన్నారు. 2021-22 నాటికి ఏపీలో 50వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్రం పార్లమెంట్ సాక్షిగా చెప్పిందని, రాష్ట్ర వ్యాప్తంగా 18వేల ఖాళీలు ఉన్నాయి కానీ 8,366 పోస్టులు భర్తీ చేస్తామని మంత్రి బొత్స అసెంబ్లీలో చెప్పి ఇపుడు 6వేల పోస్టులకు నోటిఫికేషన్ అంటున్నారని, ఇది నిరుద్యోగ యువతను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. మూడు వారాల్లో ఎన్నికల నోటిఫికేషన్ రానున్న తరుణంలో జగన్‌రెడ్డి చేస్తున్న హడావిడి వెనుక అంతర్యమేమిటో నిరుద్యోగులు తెలుసుకోలేని అమాయకులు కాదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర టీఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు ధనాల విష్ణుచౌదరి, తెలుగు యువత అధికార ప్రతినిధి బొడ్డేడ మురళి, పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి కోట్ని రామకృష్ణ, బీసీ నాయకుడు కొమ్మర్తి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు

పీఎం విశ్వకర్మ పథకం చేతి వృత్తుల వారికి వరం

▸ జిల్లా పరిశ్రమల అధికారి శ్రీధర్

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 3: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం చేతి వృత్తుల వారికి వరమని జిల్లా పరిశ్రమల అధికారి జీఎం శ్రీధర్ అన్నారు. శనివారం వీవీ రమణ రైతు భారతి హాల్‌లో నిర్వహించిన విశ్వకర్మ పథకంపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కళా నైపుణ్యాలకు మరింత మెరుగులు దిద్ది వారి కుటుంబాలకు ప్రపంచ ప్రఖ్యాతి అందించేందుకు విశ్వకర్మ కార్యక్రమం రూపొందించబడిందన్నారు. సంప్రదాయ కళాకారులకు ఆర్థిక చేయూతనివ్వడం జరుగుతుందన్నారు. ఏడు రోజులు పాటు శిక్షణ ఉంటుందని రూ. 500లు స్టైఫండ్ ఇస్తామన్నారు. డిజిటల్ సేవా కార్డుతో ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవచ్చునని, దానికి జిల్లా అమలు కమిటీ ఆమోదముద్ర వేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని 18 గుర్తించబడిన సంప్రదాయ వ్యాపారాల్లో ఉన్న అర్హులందరూ వినియోగించుకోవాలని సూచించారు. డీఎల్‌డీఓ మంజులావాణి మాట్లాడుతూ ఈ పథకంలో ఎంతమంది అయినా రిజిస్టర్ కావచ్చునని కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, కంశాలి, టైలరింగ్, సంప్రదాయ ఆట బొమ్మల రూపకర్తలు, తాపీ పని వారు, గంపలు తయారుచేసే వారు, చర్మకారులు, క్షురకులు, మత్స్యకారులు మొదలైన వృత్తులు వారు తమ పేర్లను నమోదు చేసుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ కో-ఆర్డినేటర్ ఏడీ ఎ. శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, డీపీవో శిరీషారాణి, లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి చాముండేశ్వరరావు, ఏపీడబ్ల్యూఓ నాగశిరీషా, డొమెన్స్ నిపుణులు నాగేశ్వరరావు, పరమేశ్వరరావు, విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు గంగారామ్, పట్టణ అధ్యక్షుడు కోటిపల్లి జేజిబాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్

పోలీసుల కళ్లుగప్పి
బెంగళూరుకు నిందితుడు

▸ ఉదయమే విమానంలో చెన్నై వెళ్లినట్టు భావించిన పోలీసులు

▸ అక్కడకు వెళ్లిన ప్రత్యేక బృందం

▸ తీరా చూస్తే సాయంత్రం 4.30 గంటలకు చెన్నై విమానంలో బెంగళూరుకు...

▸ నాలుగు సిమ్‌లు మార్చి మార్చి వాడుతున్నట్టు గుర్తింపు

▸ ఒకసారి భార్య నుంచి కాల్...

విశాఖపట్నం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి):

తహసీల్దార్ రమణయ్య హత్య కేసులో నిందితుడు...పోలీసుల నిర్లక్ష్యం కారణంగానే నగరం విడిచి పరారు కాగలిగాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిందితుడు తొలుత అనకాపల్లి వైపు వెళ్లి ఒకచోట తలదాచుకున్నట్టు పోలీసులు గుర్తించారు. అక్కడి నుంచి శనివారం ఉదయాన్నే ఎయిర్‌పోర్టుకు చేరుకుని చెన్నై వెళ్లిపోయినట్టు భావించిన పోలీసులు అక్కడకు ప్రత్యేక బృందాన్ని పంపించారు. ఈ క్రమంలో మధ్యాహ్నం రెండు గంటలకు విలేకరుల సమావేశం ఏర్పాటుచేసిన సీపీ రవిశంకర్‌అయ్యన్నార్ కూడా నిందితుడు ఎవరనే దానితోపాటు అతనికి సంబంధించిన పూర్తి వివరాలు, ఎక్కడికి వెళ్లిపోయాడు, ఎక్కడి నుంచి టికెట్లు బుక్ చేసుకున్నాడనే వివరాలు సంపాదించామని ప్రకటించారు. త్వరలో అతడిని అదుపులోకి తీసుకుంటామని ధీమా వ్యక్తంచేశారు. అయితే నిందితుడు శనివారం సాయంత్రం వరకూ నగరంలోనే ఉన్నాడని, 4.30 గంటలకు బెంగళూరు మీదుగా చెన్నై వెళ్లే విమానం ఎక్కినట్టు తెలియడంతో పోలీసులు కంగుతిన్నారు. నిందితుడు బెంగళూరులో విమానం దిగిపోయాడు. చెన్నై వెళ్లలేదు. అయితే నిందితుడు బెంగళూరులో ఉండిపోయిన విషయం తెలియని పోలీస్ అధికారులు అప్పటికే చెన్నై వెళ్లిన బృందాన్ని అక్కడి ఎయిర్‌పోర్టుకు పంపించి విశాఖ నుంచి వచ్చిన విమానంలో నిందితుడి కోసం వెతికించారు. నిందితుడు కనిపించకపోవడంతో అతని సెల్‌ఫోన్ టవర్ లొకేషన్ పరిశీలించగా బెంగళూరులోనే ఉండిపోయినట్టు తేలింది. నిందితుడు అప్పటికే నాలుగు సిమ్ కార్డులు మార్చి మార్చి వాడుతున్నట్టు, అతని భార్య కూడా శనివారం ఒకసారి ఫోన్ చేసి మాట్లాడినట్టు కాల్‌డేటాలో పోలీసులు గుర్తించినట్టు తెలిసింది. ఏదిఏమైనా పోలీసులు నిందితుడి ఆచూకీని పక్కాగా కనిపెట్టగలిగి ఉంటే నగరంలోనే అతడిని అరెస్టు చేసి ఉండగలిగేవారు. కానీ సరిగా అంచనా వేయలేకపోయారు. నిందితుడు ఉదయాన్నే నగరం విడిచి విమానంలో వేరే రాష్ట్రం వెళ్లిపోయినట్టు భావించారు. దీనివల్ల నిందితుడు నగరంలో జరుగుతున్న తతంగాన్ని మీడియాలో చూసి...సాయంత్రం బెంగళూరు వెళ్లాడు. నిందితుడు ఎవరనేది తెలిసినందున శనివారం ఉదయం నుంచి సరిహద్దుల్లో వాహనాల తనిఖీలు చేయడం, ఎయిర్‌పోర్టు, రైల్వేస్టేషన్, బస్‌కాంప్లెక్స్‌లో నిఘా పెట్టినట్టయితే తప్పించుకునేందుకు అవకాశం ఉండేది కాదని కొంతమంది పోలీసులే అభిప్రాయపడుతున్నారు.

'రా.. కదలిరా.. సభను విజయవంతం చేయాలి'



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ

తుమ్మపాల, ఫిబ్రవరి 3: మాడుగులలో ఈనెల ఐదో తేదీన జరిగే రా.. కదలిరా.. మహాసభను టీడీపీ, జనసేన శ్రేణులంతా విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని ప్రైవేటు కల్యాణ మండపంలో టీడీపీ, జనసేన నాయకుల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. అనకాపల్లి నియోజకవర్గం నుంచి వేలాది మంది టీడీపీ, జనసేన నాయకులు సభకు తరలివెళ్లాలన్నారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం లక్ష్యంగా కార్యకర్తలంతా పనిచేయాలన్నారు. టీడీపీ నాయకులు దాడి రత్నాకర్, జయవీర్ మాట్లాడుతూ వైసీపీ ఓటమే లక్ష్యంగా పార్టీ శ్రేణులంతా పనిచేయాలని సూచించారు. టీడీపీ, జనసేన నాయకులంతా ఒకే కుటుంబంలా ముందుకు సాగాలన్నారు. రాష్ట్రంలో వైసీపీని తరిమికొట్టేందుకు అంతా నడుం బిగించాలన్నారు. జనసేన అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి పరుచూరి భాస్కరరావు మాట్లాడుతూ టీడీపీ, జనసేన పొత్తుతో వైసీపీ నాయకుల్లో వణుకు పుడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కరోతి బంగార్రాజు, పతివాడ తమ్మునాయుడు, పీలా శ్రీకాంత్, రవిశంకర్, కాయల మురళీ, కోట్ని బాలాజీ, మళ్ల సురేంద్ర, మాదంశెట్టి నీలబాబు, సందిన చినబాబు, కొణతాల శ్రీనివాసరావు, పచ్చికూర రాము తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ కాదు.. దగా డీఎస్సీ

- టీడీపీ అధికారంలోకి వస్తే జీవో-3 పునరుద్ధరిస్తాం
- పార్టీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి

పాడేరు రూరల్, ఫిబ్రవరి 3: జగన్‌రెడ్డి వదిలింది మెగా డీఎస్సీ కాదని, అది దగా డీఎస్సీ అని టీడీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గిరిజనులకు గుండెకాయ వంటి జీవో నంబర్-3ను కొట్టేస్తే వైసీపీ పాలకులు కనీసం రివ్యూ పిటిషన్ కూడా వేయలేకపోయారన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే జీవో నంబరు-3ను పునరుద్ధరిస్తామన్నారు. రాష్ట్రంలో 50,892 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే 6,100 పోస్టులకే నోటిఫికేషన్ జారీ చేయడం నిరుద్యోగులను డీఎస్సీ పేరుతో వంచించడమేనని ఆమె పేర్కొన్నారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని జగన్‌రెడ్డి కొత్త డ్రామాకు తెరతీశారని విమర్శించారు. నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లేలా మంత్రి బొత్స సత్యనారాయణ కల్లబొల్లి మాటలు చెబుతున్నారన్నారు. సస్యశ్యామల రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్, గంజాయాంధ్రప్రదేశ్‌గా మార్చిన ఘనత జగన్‌రెడ్డిదేనని గిడ్డి ఈశ్వరి ఆరోపించారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌ను రాజధాని లేని రాష్ట్రంగా ప్రపంచ దేశాల్లో గుర్తింపు తీసుకు వచ్చిన ఘనత కూడా జగన్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. వైసీపీ నాయకుల కనుసన్నల్లోనే గంజాయి విచ్చలవిడిగా స్మగ్లింగ్ జరుగుతుందని ఆమె ఆరోపించారు. ఒక్క ఛాన్స్‌కే రాష్ట్రాన్ని అధోగతి పాల్జేసిన జగన్‌రెడ్డికి రాష్ట్ర ప్రజలు, గిరిజన ప్రాంత యువతీ, యువకులు ఓటుతో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు సోమెలి చిట్టిబాబు, జి.సింహాచలం, కె.రమేష్‌నాయుడు, డీవీ.కుమారి, సల్లంగి లక్ష్మణరావు, సంజీవరావు, మోహన్‌రావు, సత్యనారాయణ, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

120 కుటుంబాలు టీడీపీలో చేరిక

చింతపల్లి మండలం ఎర్రబొమ్మలు పంచాయతీ కొండవంచుల, ఎర్రబొమ్మలు గ్రామాల్లో 120 కుటుంబాలకు చెందిన వైసీపీ, ఇతర పార్టీల కార్యకర్తలు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి సమక్షంలో శనివారం టీడీపీలో చేరారు. గ్రామ అధ్యక్షులు పాడి సంజీవరావు, యూత్ లీడర్ మోహన్‌రావు ఆధ్వర్యంలో పాడేరులోని గిడ్డి ఈశ్వరి నివాస గృహంలో సత్యనారాయణ, రాజ్‌కుమార్, సురేష్, రామారావు, రవిప్రసాద్, విఘ్నేష్, ఉపేంద్రలతో పాటు 120 కుటుంబాలకు చెందిన వారు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ దుర్మార్గ పాలనపోయి సైకిల్ పాలన వస్తేనే అందరి బతుకులు బాగుపడతాయని పేర్కొన్నారు.


టీడీపీలో చేరిన కార్యకర్తలతో కలిసి విలేకరులతో మాట్లాడుతున్న గిడ్డి ఈశ్వరి

చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యం

గిరిజన ప్రాంతం అభివృద్ధి చెందాలంటే టీడీపీ అధినేత చంద్రబాబుతోనే సాధ్యమని పార్టీ నేత కొట్టగుళ్లి సుబ్బారావు అన్నారు. మండలంలోని నేరేడివలస, చింతగొంది, కొత్తూరు, రాయిగెడ్డ గ్రామాల్లో శనివారం బాబు షూరిటీ.. భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ అరాచక పాలనను ప్రజలకు ఆయన వివరించారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలను మోసగించారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వంజంగి కాంతమ్మ, టీడీపీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి బొర్రా విజయరాణి, రైతు సంఘం అధ్యక్షుడు కిల్లో భీమరాజు, నాయకులు వర్తన పిన్నయ్యదొర, కించే సూర్యనారాయణ, కించే రమణ, వినోద్, మత్స్యరాజు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దొన్నుదొర, పక్కన పార్టీ నేతలు

వైసీపీ పాలనలో సహజ వనరుల దోపిడీ

- టీడీపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర

అరకులోయ, ఫిబ్రవరి 3: వైసీపీ పాలనలో సహజ వనరులు దోపిడీకి గురవుతున్నాయని టీడీపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర ఆరోపించారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చాక ఇసుక, మైనింగ్, మట్టి ఇలా ప్రతీదీ దోపిడీ తప్ప ప్రజలకు మేలు జరిగిందేమీ లేదన్నారు. సీఎం జగన్ కనీసం పర్యాటకాన్ని కూడా అభివృద్ధి చేయకుండా గాలికి వదిలేసి ప్రైవేటుపరం దిశగా అడుగులు వేస్తున్నారని ఆరోపించారు. ఆదాయ వనరుగా ఉన్న రుషికొండ కాటేజీలను నేలమట్టం చేసి, ప్యాలస్ నిర్మించుకున్న నియంత జగన్‌రెడ్డి అన్నారు. గంజాయికి కేరాఫ్ ఆంధ్రాగా జగన్ మార్చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు మిరియాల మొక్కలను పెంచేందుకు గిరిజనులను ప్రోత్సహించారన్నారు. ప్రత్యేక కాఫీ ప్రాజెక్టును కోట్ల రూపాయలు వ్యయం చేసి కాఫీ, మిరియాల సాగును పెద్ద ఎత్తున ప్రోత్సహించారన్నారు. దీంతో గిరిజన రైతులు కాఫీ, మిరియాల సాగుతో ఏటా లక్షలాది రూపాయలు ఆదాయం పొందుతున్నారన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు శెట్టి బాబూరావు, పెదలబుడు సర్పంచ్ దాసుబాబు, ఎంపీటీసీ సభ్యుడు ఎల్‌బి.బీమరాజు, నాయకులు కమ్మిడి నాయుడు, కార్యదర్శి సాయిరాం, పార్టీ మండల అధ్యక్షుడు మాణిక్యం, లైసాన్, వెంకటరావు, మధు పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌జీలకు రుణ విముక్తి: ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి


స్వయం సహాయక సంఘాల సభ్యులకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

చింతపల్లి/గూడెంకొత్తవీధి, ఫిబ్రవరి 3: స్వయం సహాయ సంఘాల సభ్యులకు ఆసరా పథకం ద్వారా ప్రభుత్వం రుణ విముక్తి చేస్తున్నదని ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. చింతపల్లి, జీకే వీధి మండలాల్లో లబ్ధిదారులకు శనివారం ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసరా పథకం నాలుగో విడతలో భాగంగా జిల్లాలో రూ.34 కోట్ల రుణాలను మాఫీ చేశామన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలతో ఆర్థిక ప్రగతి సాధిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి, జీకే వీధి ఎంపీపీలు కోరాబు అనుషదేవి, బోయిన కుమారి, జడ్పీటీసీ సభ్యులు పోతురాజు బాలయ్య, శివరత్నం, సర్పంచ్ దురియా పుష్పలత, ఎంపీడీవోలు వీర సాయిబాబు, ఉమామహేశ్వరరావు, పీడీ వి.మురళీ, స్త్రీ నిధి ఏజీఎం కామరాజు, ఏపీఎం ఈపీ నాయుడు, వైసీపీ మండల అధ్యక్షుడు మోరి రవి, పార్టీ నేత బొబ్బిలి లక్ష్మణ్ పాల్గొన్నారు.

బీటీ రోడ్ల నిర్మాణాలు పరిశీలన

కొయ్యూరు, ఫిబ్రవరి 3: మండలంలోని బూదరాళ్ల పంచాయతీ పరిధిలో నిర్మిస్తున్న ఎనిమిది బీటీ రోడ్ల నిర్మాణాలను పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ (ప్రాజెక్టు) విభాగం డీఈఈ సురేష్‌రెడ్డి శనివారం పరిశీలించారు. బాలరేవుల-నూకరాయితోట, బాలరేవుల-కునుకూరు, కునుకూరు-గోదుమలంక, ముకుడుపల్లి-కిండంగి, గరికిబంధ-గరిమండ, గరికిబంధ-కొర్రపాడు, గరికిబంధ-అన్నవరం, కన్నవరం-రాజులపాడు గ్రామాలను కలుపుతూ నిర్మిస్తున్న రోడ్లు, వంతెనలు, కల్వర్టులను పరిశీలన చేశారు. ఈ సందర్భంగా డీఈఈ మాట్లాడుతూ ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకంలో బీటీ నిర్మాణాలకు నిధులు మంజూరయ్యే అవకాశం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పవన్, ప్రసాద్, సర్పంచ్ ముత్యాలమ్మ, వార్డు సభ్యులు సంజీవ్ పాల్గొన్నారు.

మిరియాల రైతు విలవిల

... 5వ పేజీ తరువాయి

వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాల్సిన గిరిజన సహకార సంస్థ, ఐటీడీఏ మిరియాలు పంటకు మార్కెటింగ్ సదుపాయం కల్పించేందుకు ముందుకు రావడంలేదు. తాజాగా కలెక్టర్ సుమిత్ కుమార్ కిలో మిరియాలకు చిక్మగలూరు, మడిగరి, మంగళూరు, గోవా మార్కెట్‌లో రూ.560- 600 ధర లభిస్తుందని పత్రికా ప్రకటన ఇచ్చారు. అయితే మార్కెటింగ్ సదుపాయం కల్పించడం లేదు. ప్రైవేటు వర్తకులు మాత్రమే మిరియాలను కొనుగోలు చేస్తున్నారు. ఆదివాసీ రైతులకు ప్రత్యామ్నాయ మార్కెట్ సదుపాయం లేకపోవడం వల్ల ప్రైవేటు వర్తకులను ఆశ్రయిస్తున్నారు. కాఫీ పంటను ఈ ఏడాది మ్యాక్స్, గిరిజన సహకార సంస్థ గరిష్ఠ ధరకు కొనుగోలు చేయడం వల్ల ఆదివాసీ రైతులకు అంతర్జాతీయ ధరలు అందాయి. ప్రైవేటు వర్తకులు సైతం అధిక ధరకు కాఫీ గింజలను కొనుగోలు చేశారు. మిరియాల పంటకు ప్రభుత్వపరంగా మార్కెటింగ్ సదుపాయం అందుబాటులో లేదు. దీంతో ఆదివాసీ రైతులు మిరియాల పంటకు జాతీయ మార్కెట్ ధరలు పొందలేకపోతున్నారు.

కేరళ మార్కెట్‌లో గరిష్ఠ ధరలు

కేరళ(కొచ్చిన్) మార్కెట్‌లో మిరియాలకు గరిష్ఠ ధర లభిస్తున్నది. కిలో మిరియాలకు శనివారం రూ.580 ధర లభించింది. ఈ ధర మరింతగా పెరిగే అవకాశముందని స్పైస్ బోర్డు అధికారులు చెబుతున్నారు. కేరళ మార్కెట్ ధరలను దేశ వ్యాప్తంగా వర్తకులు ప్రామాణికంగా తీసుకుంటారు. జాతీయ మార్కెట్‌లో గరిష్ఠ ధర ఉన్నప్పటికి ప్రాంతీయ వర్తకులు సిండికేట్‌గా మారి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు.

జీసీసీ, ఐటీడీఏ మిరియాలు కొనుగోలు చేయాలి

మిరియాల పంటను గిరిజన సహకారం సంస్థ, ఐటీడీఏ కొనుగోలు చేయాలి. జీసీసీ, ఐటీడీఏ మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తే కాఫీ తరహాలో మిరియాల పంటకు జాతీయ మార్కెట్ ధరలు లభించే అవకాశముంది. మిరియాల పంటను ప్రైవేటు వర్తకులకు విక్రయించుకుని నష్టపోతున్నాం. ఐటీడీఏ పీవో, జీసీసీ ఎండీ స్పందించి మిరియాలకు గిట్టుబాటు ధర కల్పించాలి.



-జల్లి ప్రవీణ్, మిరియాల రైతు, లంకపాకలు

అప్రెంటీస్ విధానాన్ని ప్రవేశపెట్టడం అన్యాయం

- యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు విల్సన్‌బాబు
- మూడో రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు

పాడేరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సంఘాలు 14 ఏళ్ల పోరాడి రద్దు చేయించుకున్న అప్రెంటీస్ విధానాన్ని మళ్లీ రాష్ట్ర ప్రభుత్వం తెరపైకి తేవడం అన్యాయమని యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు విల్సన్‌బాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల ఆర్థిక బకాయిలు చెల్లించాలనే డిమాండ్‌పై ఐటీడీఏ కార్యాలయం ముందు చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారానికి మూడో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు విల్సన్ బాబు మాట్లాడుతూ రద్దయిన అప్రెంటీస్ విధానాన్ని మళ్లీ తీసుకువచ్చి ఉపాధ్యాయ పోస్టులు పొందేవారికి ఇబ్బందులకు గురిచేయాలని అనుకోవడం ప్రభుత్వానికి తగదన్నారు. తక్షణమే అప్రెంటీస్ విధానాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం వివిధ రూపాల్లో ఉద్యోగులకు రూ.వేల కోట్లు బకాయి పడిందని, వాటిని తక్షణమే చెల్లించాలని కోరారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులను ఇంతగా ఏ ప్రభుత్వం కూడా ఇబ్బందులకు గురి చేయలేదని, తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని ఆయన విన్నవించారు. ఈ ఈకార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షుడు చీకటి నాగేశ్వరరావు, నాయకులు చిట్టిబాబు, దేముడు, తేజారావు, రఘునాథ్, శ్రీనివాస్, రాఘవులు, చినబాబు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రిలే దీక్షల్లో మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు విల్సన్‌బాబు

విద్యుత్ కేంద్రం సమాచారాన్ని నిక్షిప్తం చేయాలి

- జల విద్యుత్ కేంద్రం సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ శ్రీధర్

సీలేరు, ఫిబ్రవరి 3: జల విద్యుత్ కేంద్రానికి సంబంధించిన సమాచారం నిక్షిప్తం చేయాల్సి అవసరం భావితరాల ఇంజనీర్లకు ఎంతైనా అవసరమని సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ బి.శ్రీధర్ సూచించారు. ఈఈ ఎం.లక్ష్మీనారాయణ యూనిట్ల ఆధునీకరణ గురించి రాసిన పుస్తకాన్ని శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ సీలేరు కాంప్లెక్స్‌లో ఉన్న జల విద్యుత్ కేంద్రాలకు ఎటువంటి రికార్డులు లేవని, దీనివల్ల మరమ్మతుల సమయంలో ఇబ్బందులు పడాల్సి వస్తున్నదని చెప్పారు. గతంలో ఒకటో యూనిట్ మరమ్మతులకు గురైనప్పుడు లోపాలను తెలుసుకోవడానికి నెలలు తరబడి సమయం పట్టిందన్నారు. అలాగే నాలుగో యూనిట్ మరమ్మతులు వచ్చినప్పుడు ఇదే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ తరుణంలో ఈఈ లక్ష్మీనారాయణ నాలుగో యూనిట్ ఓవరాలింగ్ సమయంలో అనువణువు పరిశీలించి, వాటి లోపాలను ఎలా అధిగమించాలో పుస్తకం రాయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈలు కేకేవీ.ప్రశాంత్‌కుమార్, వెంకటేశ్వరరావు, ఈఈలు బాలకృష్ణ, ప్రభాకరరావు, శివశంకర్, ఎం.శ్రీనివాసరావు, డీఈఈలు, ఏఈఈలు పాల్గొన్నారు.


జల విద్యుత్ కేంద్రం సమాచార పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఈ శ్రీధర్

చంద్రబాబు పర్యటన ఖరారు

విశాఖపట్నం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం గొండుపాలెంలో ఈ నెల ఐదో తేదీన జరిగే రా.. కదలిరా సభకు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు హాజరయ్యే పర్యటన షెడ్యూల్ ఖరారైంది. సోమవారం ఉదయం 10 గంటలకు ఉండవల్లిలోని తన నివాసం నుంచి చంద్రబాబు హెలికాప్టర్‌లో బయలుదేరి 11.20 గంటలకు గొండుపాలెం చేరుకుంటారు. అక్కడ నుంచి 11.30 గంటలకు సభా వేదికకు చేరుకుని మధ్యాహ్నం ఒంటి గంట వరకు సభలో పాల్గొంటారు. సభ ముగిసిన తరువాత తిరిగి 1.40 గంటలకు హెలిప్యాడ్‌కు చేరుకుని 1.45 గంటలకు ఏలూరు జిల్లా చింతలపూడిలో నిర్వహించే సభలో పాల్గొనేందుకు వెళతారు.

కేంద్ర పథకాలను ప్రజల్లో తీసుకెళ్లండి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజారావు

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 3: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజారావు పిలుపునిచ్చారు. మండలంలోని కించుమండ పంచాయతీ కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు కిరసాని రమేష్ ఆధ్వర్యంలో శనివారం డుంబ్రిగుడ, అరకులోయ మండలాల కార్యకర్తల శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గిరిజన ప్రాంతంలో రోడ్లు, శాశ్వత గృహ నిర్మాణాలతో పాటు పలు పథకాలను అమలు చేస్తున్నదన్నారు. పీవీటీజీల జీవితాల్లో సమూల మార్పులు తీసుకొచ్చేందుకు జన్‌మన్ పథకం ప్రవేశ పెట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వంతోనే గిరిజనులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బిసాయి మూర్తి, అరకు అసెంబ్లీ కన్వీనర్ ధర్మరాజు, సాగర ఎంపీటీసీ సభ్యుడు దేవదాసు, అరకులోయ మండల అధ్యక్షుడు రాంచందర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీలేరులో భవిష్యత్ గ్యారెంటీ..

సీలేరు, ఫిబ్రవరి 3: మేజర్ పంచాయతీ సీలేరులో శనివారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ సీలేరు గ్రామ కమిటీ అధ్యక్షుడు కె.సన్యాసిరావు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కోడా సురేష్‌కుమార్, కె.వెంకటప్రసాద్, చిటికెల రాము, బొర్ర కృష్ణ, వేణుగోపాల్ పాల్గొన్నారు.

'పల్లెకు పోదాం'ను జయప్రదం చేయాలి

కొయ్యూరు, ఫిబ్రవరి 3: పల్లెకు పోదాం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గిరిజన మోర్చా మేధావుల విభాగం రాష్ట్ర కన్వీనర్ కురుస పార్వతమ్మ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన పార్టీ శ్రేణుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమం నిర్వహణకు మార్గదర్శకాలపై అవగాహన కల్పించి విజయవంతానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కూడ కృష్ణారావు, అరకు పార్లమెంట్ కన్వీనర్ భారతి, గిరిజన మోర్చా జిల్లా ప్రతినిధులు ఉమామహేశ్వరరావు, రాజు, చంద్రరావు, పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ ఈశ్వరావు, మండల కార్యదర్శులు త్రినాథ్, నకరాజు, సరబయ్య, నాయకులు గాలి దేముడు, భూలక్ష్మి, సంకురమ్మ పాల్గొన్నారు.

మోదకొండమ్మ, ఉమానీలకంఠేశ్వరుని దర్శించుకున్న ఆదివాసీ ఎమ్మెల్యేలు

పాడేరు రూరల్, ఫిబ్రవరి 3: అల్లూరి జిల్లా పర్యటనకు వచ్చిన రాజస్థాన్, గుజరాత్ ఆదివాసీ ఎమ్మెల్యేలు శనివారం మోదకొండమ్మ, ఉమానీలకంఠేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే రాజ్‌కుమార్ రోత్, ఉమేష్ దమోర్, తవార్ చాంద్ దమోర్, భారత ఆదివాసీ పార్టీ జాతీయ అధ్యక్షులు మోహన్‌లాల్ రోత్, దేవీలాల్ రోత్, వినయ్ తబియాడ్ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన వారికి కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సంహాచలంనాయుడు, ఆలయ కమిటీ ప్రతినిధులు కొట్టగుళ్లి రామారావు, ఎస్.శ్రీనివాస్‌కుమార్, ఎస్.కొండలరావు శాలువలతో సత్కరించి చిత్రపటాలు అందించారు.


ఉమానీలకంఠేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న దృశ్యం

ఆదివాసీలకు ఉచిత విద్యుత్ పేరుతో దోపిడీ


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు రాధాకృష్ణ

పాడేరు రూరల్, ఫిబ్రవరి 3: ఆదివాసీలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని బాకా ఊదుకున్న వైసీపీ ప్రభుత్వం ఇప్పుడు ఒక్కసారిగా ఆదివాసీలకు వేలల్లో విద్యుత్ బిల్లులు ఇచ్చి చెల్లించాలని నిలువు దోపిడీకి పాల్పడుతున్నదని సీపీఐ మండల సహాయ కార్యదర్శులు కూడా రాధాకృష్ణ, అమర్ ఆరోపించారు. శనివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆదివాసీలకు 200 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా అందిస్తున్నామన్న జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో విద్యుత్ శాఖాధికారులు వినియోగదారులకు మైనస్ బిల్లులు అందించేవారన్నారు. ప్రస్తుతం ప్లేట్ మార్చి వినియోగదారులకు రూ.వెయ్యి నుంచి రూ.10 వేల వరకు చెల్లించాలంటూ నిలువునా ముంచుతున్నారన్నారు. ఒక్కసారిగా వేలల్లో బిల్లులు రావడంతో చెల్లించే ఆర్థిక స్తోమత లేని ఆదివాసీలు లబోదిబోమంటూ ఆందోళన చెందుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణరావు, అఖిల్, రావణ్ పాల్గొన్నారు.

ఎర్రబయలు వాసులపై దాడి.

.. 5వ పేజీ తరువాయి

చేశారు. తరువాత పోలీసులు అక్కడ నుంచి వెళ్లిపోయారు.

పోలీసులకు సమాచారం ఇచ్చారనే అనుమానంతో...

కోడి పందేలపై పోలీసులు దాడులకు పాల్పడేందుకు ఎర్రబయలు వాసులే కారణమని గొందిపల్లి, వనగరాయి వాసులు అనుమానం వ్యక్తం చేశారు. దీంతో గ్రామం నుంచి పోలీసులు ఇలా బయటకు వెళ్లగానే వారంతా ఒక్కసారిగా ఎర్రబయలులో పలువురు ఇళ్లపై కర్రలు, రాళ్లతో దాడులకు తెగబడ్డారు. ఈ ఘటనలో నలుగురికి తీవ్ర గాయాలు కాగా, అనేక ఇళ్ల రేకులు ధ్వంసమయ్యాయి. దీంతో అక్కడికి సమీపంలో వున్న పోలీసులు అప్రమత్తం కావడంతో పెద్ద ప్రమాదం తప్పింది. హుటాహుటిన గాయాలైన వారిని పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. అలాగే ఈ ఘటనపై వనగరాయికి చెందిన నలుగురు, గొందిపల్లికి చెందిన 16 మంది, తూలం గ్రామానికి చెందిన ఒకరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎర్రబయలు, వనగరాయి వాసుల మధ్య చాలా కాలంగా విభేదాలు ఉన్నాయని, కోడి పందేల ఘటనతో వారి మధ్య వున్న కక్షలు పురివిప్పాయని స్థానికులు అంటున్నారు.

గిరి పల్లెల్లో పండుగ సందడి

... 5వ పేజీ తరువాయి

నిర్వహిస్తారు. దీనిని స్థానిక భాషలో 'పుష్య పోరోబ్' అంటారు. దీంతో ఈ 15 రోజులు గిరిజన పల్లెల్లో సందడి వాతావరణం నెలకొంటుంది. ప్రధానంగా ఇతర గ్రామాల్లోని వారి బంధువులను తమ గ్రామాలకు ఆహ్వానించుకుంటారు. వారికి మద్యం, మాంసంతో భోజనాలు పెడతారు. అలాగే కొత్త దుస్తులు కొనిస్తారు. దీంతో గిరిజనులు 15 రోజులు అటూ ఇటూ పండుగ చుట్టాలుగా రాకపోకలు సాగిస్తారు. ఒక్కో ప్రాంతం గిరిజనులు ఒక్కో వారం చొప్పున నెల రోజులు చుట్టాల రాకపోకలు కొనసాగుతాయి. అలాగే పుష్యమాసం ఆఖరి వారం వరకు ప్రతి రోజు రాత్రిళ్లు మహిళలు థింసా నృత్యాలు, పురుషులు డప్పువాయిద్యాలతో సందడి చేస్తారు. పురుషులు మాత్రమే వివిధ వేషధారణలతో గ్రామాల్లో తిరుగుతుంటారు. దీంతో పుష్యమాసంలోనే ఏజెన్సీలోని వారపు సంతలు సైతం జనంతో కళకళలాడతాయి. పండుగకు అవసరమైన కొత్త కుండలు, డప్పులు, దుస్తులు, ఇతర వస్తువులు కొనుగోలు చేసుకుంటారు. పండుగ సామగ్రిని కొనుగోలు చేసేందుకు వారపు సంతలకు సైతం కుటుంబ సమేతంగా వెళుతుంటారు. దీంతో సంతల్లోనూ సందడి నెలకొంటుంది.

సంక్షిప్తంగా..

ఆర్బీకేల తాత్కాలిక సిబ్బంది ఆకలి కేకలు

- రెండు నెలలుగా అందని వేతనాలు

పాడేరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రైతుభరోసా కేంద్రాల్లో తాత్కాలిక పద్ధతిన పనిచేస్తున్న సిబ్బందికి రెండు నెలలు ప్రభుత్వం వేతనాలు చెల్లించలేదు. దీంతో వారంతా పూట గడపడానికి తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్బీకేల్లో ధాన్యం, రాగులు కొనుగోలు చేసేందుకు వినియోగించుకులా టెక్నికల్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా జిల్లా వ్యాప్తంగా 140 మందిని ప్రభుత్వం నియమించింది. టెక్నికల్ అసిస్టెంట్‌కు నెలకు రూ.15 వేలు, డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు రూ.12 వేలు చొప్పున జీతం నిర్ణయించింది. దీంతో వారంతా గత రెండు నెలలు ధాన్యం, రాగులు కొనుగోలు తదితర పనులు చేశారు. ఆఖరుకు వారి రెండు నెలల గడువు పని ముగిసి మరో నెల గడుస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి వేతనాలు మాత్రం రాలేదు. దీంతో బాధితులు లబోదిబోమంటూ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి జీతాల నిధులు విడుదలైతేగాని చెల్లించలేమని అధికారులు స్పష్టం చేస్తున్నారు. దీంతో రెండు నెలలు ఎంతో కష్టపడి పనిచేసిన తమకు తక్షణమే వేతనాలు ఇవ్వకపోవడం అన్యాయమని వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని బాధితులు వేడుకుంటున్నారు.

10న చింతపల్లికి పీసీసీ అధ్యక్షురాలు షర్మిల

చింతపల్లి, ఫిబ్రవరి 3: పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఈ నెల 10న చింతపల్లిలో పర్యటించనున్నారని డీసీసీ అధ్యక్షుడు వంతల సుబ్బారావు తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పీసీసీ అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత షర్మిల తొలిసారిగా చింతపల్లి పర్యటించనున్నారన్నారు. పాత బస్టాండ్ నుంచి హనుమాన్ జంక్షన్ వరకు పార్టీ కార్యకర్తలు, గిరిజనులతో కలిసి ర్యాలీ చేస్తారన్నారు. అనంతరం ఆర్ అండ్ బీ మైదానంలో ఏర్పాటు చేసే బహిరంగ సమావేశంలో పాల్గొంటారన్నారు.

660 లీటర్ల సారాతో ఇద్దరి అరెస్టు

పాడేరు రూరల్, ఫిబ్రవరి 3: ముంచంగిపుట్టు మండలం జోలాపుట్టు గ్రామ సమీపంలో శనివారం 660 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశామని ఎస్ఈబీ సీఐ సతీష్‌కుమార్ తెలిపారు. ఎస్ఈబీ సిబ్బంది దాడులు చేపట్టగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన 660 లీటర్ల సారాను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. అలాగే ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఆయన తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఈబీ స్టేషన్ ఎస్ఐ సురేష్‌కుమార్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

తాగునీటి పథకం పనులకు శంకుస్థాపన

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 3: మండలంలోని వనుగుమ్మ పంచాయతీ కేంద్రంలో తాగునీటి పథకం పనులకు సంబంధించి వైస్ ఎంపీపీ శిరగం భాగ్యవతి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్ నిధులు రూ.20 లక్షలు వెచ్చించి ఈ పథకాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. పనులు వేగవంతంగా పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. దశలవారీగా గ్రామాల్లో తాగునీటి సౌకర్యం కల్పనకు కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మిల్కీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పురుషోత్తం, వైసీపీ నాయకులు దేవా, నీలకంఠం, గురుమూర్తి, సోనియా, చందర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.7.5 లక్షలతో గ్రావిటీ పథకాలు

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 3: మండలంలోని కండ్రుం పంచాయతీ బైలుగుడ, లాసేరుగుడ గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ నిధులు రూ.7.5 లక్షలతో సోలార్ గ్రావిటీ నీటి పథకాల పనులను శనివారం ప్రారంభించారు. గ్రామాల్లో సోలార్ గ్రావిటీ పథకం ద్వారా తాగునీటిని కల్పించడం జరుగుతుందని ఈ సందర్భంగా కండ్రుం సర్పంచ్ హరి చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆనందరావు, వార్డు సభ్యులు బలరాం, శ్రీనివాసరావు, లచ్చన్న, నాయకులు గోపి, మోహన్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ నాని, గ్రామస్థులు పాల్గొన్నారు.

'ప్రజా సంక్షేమమే ధ్యేయం'

కొయ్యూరు, ఫిబ్రవరి 3: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని వైసీపీ పాడేరు నియోజకవర్గ సమన్వయకర్త విశ్వేశ్వరరాజు అన్నారు. మండలంలోని బంగారమ్మపేట, చింతలపూడి, అంతాడ పంచాయతీలలో శనివారం పర్యటించి ప్రజలతో సమావేశాలు నిర్వహించారు. మాటకు కట్టుబడి ఐదేళ్లుగా రాష్ట్రంలో పాలన సాగిస్తున్న జగన్‌ను ఆదరించాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బడుగు రమేష్‌బాబు, జడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు, వైస్ ఎంపీపీలు వెంకటరమణ, నూకాలమ్మ, చింతపల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రాజులమ్మ తదితరులు పాల్గొన్నారు.

వారపు సంతలో పోలీసుల గస్తీ

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 3: మండల కేంద్రంలో శనివారం జరిగిన వారపు సంతలో ఎస్ఐ కె.రవీంద్ర ఆధ్వర్యంలో పోలీసులు గస్తీ నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సీఆర్‌పీఎఫ్, ఏపీఎస్పీ పోలీసు బలగాలు మారుమూల గ్రామాల నుంచి సంతకు వచ్చిపోయిన వాహనాలను తనిఖీలు చేశారు. అనుమానాస్పదంగా కనిపించే వ్యక్తులను ప్రశ్నించి విడిచిపెట్టారు. ఛత్తీస్‌గఢ్ ప్రాంతంలో ఇటీవల మావోయిస్టులు అలజడి చేయడంతో స్థానిక పోలీసులు అప్రమత్తమయ్యారు. నాలుగు రోజులుగా రాత్రి గస్తీలతో పాటు ప్రధాన కూడళ్లలో వాహన తనిఖీలు చేపడుతున్నారు.

గిరిజన యువకుడికి డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ అందుకుంటున్న సింహాచలం

పాడేరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పాడేరు ప్రాంతానికి చెందిన కుర్రబోయిన సింహాచలం అనే గిరి యువకుడికి సౌత్ కొరియాకు చెందిన యునైటెడ్ నేషన్ బుషన్ యూనివర్సిటీ నిరుద్యోగ సమస్య నిర్మూలనకు కృషి చేసినందుకుగాను డాక్టరేట్ ప్రదానం చేసింది. సింహాచలం 'గిరిజన యువ ప్రగతి' స్వచ్ఛంద సంస్థను స్థాపించి 11 ఏళ్లు విద్య, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ సందర్భంగా సదరు యూనివర్సిటీ పెద్దలు శనివారం చెన్నైలో జరిగిన ఓ కార్యక్రమంలో సింహాచలానికి డాక్టరేట్‌ను అందజేశారు. గిరిజన యువకుడికి డాక్టరేట్ దక్కడంపై ఈ ప్రాంత వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.